

ప్రమాదాలకు నిలయంగా మెర్నిపాడు రోడ్డు



గోతులమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-మండపేట

పాలతోడు నుంచి వెలగతోడు మీదుగా మెర్నిపాడు వెళ్లే మెయిన్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు ఐదు కి.మీ ఉన్న రోడ్డు గోతుల మయంగా మారి రాళ్లు పైకి లేచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాలకు సమీపంలో ఫ్యాక్టరీలు, నర్సరీలు వుండడంతో జీవనోపాధి కోసం కార్మికులు ఉద్యోగులు రోజూ ఈ రోడ్డును ఎక్కువగా వారి అవసరాలకోసం వినియోగిస్తుంటారు. రోడ్డంతా అధ్వానంగా మారడంతో రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదాల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కనీసం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

తాగునీటి సరఫరాకు తప్పని ఆటంకాలు

తరచూ మరమ్మతులకు గురవుతున్న పైపులైన్లు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలలంలో తాగునీటి సరఫరాకు తరుచూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పైప్‌లైన్లు మరమ్మతులకు గురికావడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.మండలంలోని గ్రామాల ప్రజలు శుద్ధి చేసిన గోదావరి జలాలను అందించేందుకు రూ.12 కోట్ల 55 లక్షల తో బొబ్బర్లంక, ఉచ్చిలి వద్ద 2008, 2016లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి బొబ్బర్లంక వద్ద గోదావరి జలాలను శుద్ధిచేసి అందించేందుకు పైప్‌లైన్లు ఆర్ అండ్‌బి రోడ్డు చెంతన ఏర్పాటు చేశారు

పైప్‌లైన్లు వేసే సమయంలో అధికారులు పర్యవేక్షణ లేకపోవడం గుత్తేదారు నాసిరకం పైపులు వేయడంతో తాగునీటికి అడుగడుగునా ఆటంకం ఏర్పడుతోంది. 17 గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులకు ఈ పైపులైన్లు అనుసంధానం చేయవలసి ఉండగా నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో గోదావరి జలాలు అందక పలువురు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం సగటున మనిషికి రోజుకు 40 లీటర్ల



వెలిచేరు వద్ద పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

శుద్ధి చేసిన గోదావరి జలాలను అందిస్తున్నామంటూ చెబుతున్నారు.

పైప్‌లైన్లు ఆర్ అండ్‌బి రోడ్డు చెంతన వేయడంతోపాటు వెలిచేరి నుంచి ఆత్రేయపురం వరకు రోడ్డును అభివృద్ధి పేరిట వెడల్పు చేయడంతో పైప్‌లైన్లు రోడ్డు అడుగు భాగాన ఉండడంతో భారీ వాహనాలు దాటికి అవి పగిలి త్రాగునీరు ముందుకు సాగేందుకు అడుగడుగునా ఆటను కలుగుతోంది.

దీంతో మరమ్మతులు చేసినప్పటికీ కూడా పైప్‌లైన్లు పగిలిపోవడంతో మండలంలోని గ్రామాల ప్రజలకు గోదావరి జలాలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి వెలిచేరి వద్ద పైప్‌లైన్లు పగిలి నెల రోజులుగా గోదావరి జలాలు వధాగా పోతున్న అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. మండలంలోని 2011 లెక్కల ప్రకారం17 గ్రామాలలో 65 వేల 580 జనాభా ఉండగా సగటున లీటర్కు రూ.2.40 పైసలు ఖర్చు చేస్తున్నారు సంవత్సరానికి రూ.25 లక్షలు పై పడే ఖర్చు చేస్తున్నా గోదావరి జలాలు పైప్‌లైన్లు పగిలి వధాగా పోతున్నాయి.



ఉచ్చిలి వద్ద ఓవర్ హెడ్ ట్యాంక్

ఆత్రేయపురం బస్టాండ్ వద్ద పంచాయతీ వద్ద కుళాయిలు ఏర్పాటు చేశారు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం మూడు గంటలు దాటిన తర్వాత రెండు గంటల పాటు గోదావరి జలాలు వస్తాయి. గ్రామ ప్రజలు ఈ నీటిని తాగుతున్నారు కానీ తరచూ పైపులైన్లు పగిలి అంతరాయం కలగడంతో శుద్ధి చేసిన జలాల కోసం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. 30 రోజుల్లో సగటున పది రోజులు కూడా నీరు రావడం లేదంటూ స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న వారి పట్టించుకోవడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని గోదావరి జలాలు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

బోర్ వాటర్ తాగవలసి వస్తోంది



శుద్ధి చేసిన గోదావరి జలాలను తాగడం వలన కడుపుబ్బరం, గ్యాస్ట్రిక్, మోకాళ్ల నొప్పులు ఉండడం లేదు. ఆరోగ్యంగా ఉంటున్నాం. కానీ ఈ జలాలు రోజు రాకపోవడంతో బోరు వాటర్ తాగవలసి వస్తోంది. దీంతో అనారోగ్యానికి గురవుతున్నాం.

-చిలుకూరి రామకృష్ణంరాజు ఆత్రేయపురం

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని దొంతికుర్రు, కందికుప్ప, కాట్రేనికోన, లక్ష్మీవాడ ప్రాంతాలలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రారంభించారు. దొంతుకూరు గ్రామంలో సీతమ్మ చెరువు ప్రాంతానికి తాగునీరు అందించే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కందికుప్ప పంచాయతీ పరిధిలో ప్రజలకు తాగునీటిని అందించే ఫిల్టర్ బెడ్‌లను ప్రారంభించారు. కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం నందు నిర్మించిన రైతు భరోసా కేంద్రం-2, విలేజ్ క్లినిక్ భవనాలను, లక్ష్మీవాడ గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్‌ఎ సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా



అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎ సతీష్

సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న వైసిపి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్‌కుమార్, ఎంపిపి పాలెపు లక్ష్మీ ధర్మారావు, మండల కన్వీనర్ నల్లా నరసింహ మూర్తి, సర్పంచ్‌లు గంటి వెంకట సుధాకర్, చల్లగల వెంకట లక్ష్మి అప్పారావు, గెద్దాడి ఈశ్వరి, చొల్లంగి శ్రీలక్ష్మి వెంకటేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నాలుగో విడత 'చేయూత'

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని 4వ విడత వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేగుళ్ల పట్టాభిరామయ్యా చౌదరి, కోప్షన్ సభ్యులు రెడ్డి రాజాబాబు హాజరయ్యారు. తొలుత మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల ఉత్పత్తులను సందర్శించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం పేదల కోసం అమలు



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్నఎంఎల్‌సి తోట

చేస్తోందన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకుంటూ వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వారు కోరారు. అనంతరం పట్టణంలో లబ్ధిపొందిన 2435 మందికి రూ.4,56,56,250 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు గ్రంధి శ్రీనివాస్, ఎఎంసి డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, కమిషనర్ బి.రాము, సాధనాల శివభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- రాజోలు

శివకోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది.1976-81 మధ్యకాలంలో పాఠశాల్లో వీరంతా విద్యనభ్యసించారు. నాటి స్నేహితులను మరోసారి కలుసుకోవాలనుకున్నదే తడవుగా 43 ఏళ్ల తరువాత ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం మలికిపురం మండలం దిండి రిసార్ట్స్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సరదా కబుర్లతో రోజంతా గడిపారు.విద్యార్థులు గురువులు చెప్పిన సూచనలు పాటిస్తూనే ఉన్నత స్థానాల్లో ఉన్నామని అందుకు గురువులకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ బ్యాచ్ లో ఉన్నవారు



కార్యక్రమంలో పాల్గొన్న శివకోడు జెడ్‌పి పాఠశాల పూర్వవిద్యార్థులు

అంతా వివిధ వ్యాపార, ఉద్యోగ రంగాల్లో స్థిరపడ్డారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు బండ్రెడ్డి విజయప్రసాద్, కడలి రవి వరప్రసాద్, నల్లి వెంకటేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-రామచంద్రపురం

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. కె. గంగవరం మండలం లోని కోట శేరులంక గ్రామంలో ఎంపీ నిధులు రూ.20 లక్షల తో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అభివద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును మర్చిపోకూడదని బోస్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పంపన నాగమణి, సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు,



సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంపీ బోస్

పెట్టా శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు ఓబులునేని శ్రీ వరలక్ష్మి, సర్పంచ్ మల్లిడి వెంకటరావు, కోటిపల్లి అబ్బు , కోటిపల్లి దేవస్థానం చైర్మన్ వాసంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాతకు ఆదివారం విరాళం ఇచ్చారు. నగరం వాసులు వానరాసి కాశీ విశ్వేశ్వరరావు, సత్యానందం దంపతులు పెళ్లిరోజు ప్రతి ఏటా మే 16న అన్నదానము జరిపించు నిమిత్తం వారి కుమారులు వీర శంకర్‌రావు, వెంకట రత్నప్రసాద్ రూ.10వేలు విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. ఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు మరియు సిబ్బంది దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారన్నారు.



శ్రీనుకు నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ జగ్గిరెడ్డి

ఎఎంసి డైరెక్టర్ శ్రీను మృతి తీరని లోటు

ప్రజాశక్తి-ఆలమూరు

మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, పెనికేరు వైసిపి నేత చవ్వాకుల శ్రీనివాస్ మృతి తీరని లోటని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శ్రీను ఆదివారం ఉదయం తన నివాసంలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీను మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీను పార్టీలో చాలా క్రియా శీలకంగా పనిచేసేవారని, ఆయన సేవలను గుర్తుచేసు కున్నారు. శ్రీను మృతి పట్ల కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామన్నారు. అలాగే ఆకుటుంబానికి తక్షణ సాయంగా రూ.50 వేలు అందజేశారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ వనుం చిన్నావతి జార్జి బాబు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

జిల్లాలో పలుచోట్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పాల్గొని మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పలువురిని ఘనంగా సత్కరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం అమలాపురం ఎంప్లాయిస్ హోమ్ నందు ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు గరగ సీతాదేవి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు హాజరై మహిళలపై జరుగుతున్న అకత్యాలు, ప్రస్తుత సమాజంలో మహిళలపై అచారాల పేరుతో జరుగుతున్న అన్యాయంపై మహిళలలో మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్త గా హాజరైన శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి మహిళల హక్కులకే ప్రధానంగా పోరాడేది పురుషులేనని మహిళలు కూడా తమ హక్కుల కోసం పోరాటంలో ముందుండాలని తెలియజేశారు. దేశంలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయని వాటిని నియంత్రించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని మహిళలు అన్ని రంగాలలో ముందున వివక్షనేటికీ కొనసాగుతుందన్నారు. మహిళా చైతన్యంలో వివక్షపై పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతి బసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివి.సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవరావు, జిల్లా కార్యదర్శులు జివి.రమణ, పి.మురుగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, కుడిపూడి శ్రీనివాసరావు, టి.దుర్గాప్రసాద్, వి.రత్నం, బి.చంద్రకళ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బివిఎన్. చైతన్య , రాష్ట్ర కౌన్సిలర్ మేరీ రూతు సుమారు 200 మంది మహిళా కార్యకర్తలు పాల్గొన్నాడ.



అమలాపురంలో ఎంప్లాయిస్ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌సి ఐవి తదితరులు



అమాపురం జెడ్‌పి హైస్కూల్లో మహిళా దినోత్సవం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్ర మణి అన్నారు. ఆదివారం అమలాపురం పట్టణ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కల్వకొలను ఛాయా దేవి తదితరులు మాట్లాడుతూ మహిళల ఉన్నతిపై ప్రసంగించారు. కార్యక్రమం లో దివంగత మాజీ ఎంఎల్‌ఎ కుడుపూడి చిట్టిబ్బాయి సతీమణి అరుణ, దిట్టకవి అమ్మాజీ, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్పర్సన్ మేరీ, పెయ్యల సంధ్య, చిట్టూరి లక్ష్మి, మాజీ కౌన్సిలర్లు మట్టపర్తి పార్వతి, సంసాని శ్యామల దేవి గొవ్వాల శ్రీదేవి, కౌన్సిలర్లు దొంగ సుధ రాణి, వాసర్ల లక్ష్మి, పడాల శ్రీదేవి, తిక్కా లక్ష్మీ, షేక్ సుల్తానా, రామ లక్ష్మి, మెప్మా కోఆర్డినేటర్ దేవకీ తదితరులు పాల్గొన్నారు.పాల్గొన్నారు.

ముమ్మిడివరం. మహిళా ఉపాధ్యాయులు తమ హక్కుల పరి రక్షణకు, రాజ్యాంగంలో కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అన్నారు.

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాల్లో ఎస్‌టియు మండల శాఖా అధ్యక్షురాలు పి హిమబిందు అధ్యక్షతన ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం వివిధ రంగాలలో విశేష ప్రతిభ చూపిన 25 మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మణ్ కుమార్, పి.వెంకటేశ్వర రాజు తోట బాలకృష్ణ, నల్లా రామకృష్ణ, కుడిపూడి హేమంత్ కరుణ తదితరులు పాల్గొన్నారు.



రక్షణ వలయం లేని ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద సీతానగరం నుండి వెలగతోడు, పాలతోడు వెళ్లే రోడ్డులో రహదారిని అనుకొని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ 11 కెవి వైర్లు చేతికి అంది అంత ఎత్తులోనే ఉండడంతో రైతులు, వ్యవసాయ కూలీలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

పొ ర పా ట ు న విద్యుత్ వైర్లు వైర్ తగిలితే ప్రమాదం సంభవిస్తుందని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో పెట్టడమే కాకుండా దాని చుట్టూ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ప్రమాదాలు సంభవించక ముందే తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



బండారులంకలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే వర్ధంతి

భారతీయసంఘ సంస్కర్త, దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే దంపతుల విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం/అమలాపురంరూరల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే 127 వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అమలాపురం మండలం బండార్లంక రోడ్డులోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వర రావు, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు మహబూబ్ షకిలా నాయకత్వంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా అట్టడుగు వర్గాలకు విద్యనందించిన ఘనత ఆమెకే దక్కిందని కొనయాడారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు ముషిణి రామకష్ణారావు, పిసిసి కార్యదర్శులు మాచవరపు శివన్నారాయణ, అయితాబత్తుల సుభాషిణి, రాష్ట్ర ఒబిసి కోఆర్డినేటర్ బిఎజెడబ్ల్యూ రెడ్డి బాబు, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి రాయుడు గంగాభవాని, పార్టీ ఇన్ చార్జి వంటెద్దు బాబి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి నిమ్మకాయల నాగేంద్ర ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.**రామచంద్రపురం** సావిత్రీబాయి పూలే 127 వ వర్ధంతిని ద్రాక్షారామలో నియోజకవర్గ మైనార్టీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ద్రాక్షారామ మసీద్ సెంటర్ లో గల పూలే దంపతులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యాట్ల మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సత్యశోధక్ సమాజ్ ను స్థాపించి శ్రామిక మహిళా సాధికారిత అనేది సావిత్రీబాయి పూలేతో సాధ్యమైందని. తన భర్త పూలే తో కలిసి 1841జనవరి 1న పూణే లో మొదటి మహిళా పాఠశాల ప్రారంభించారని తెలిపారు.



ద్రాక్షారామంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిలో పాల్గొన్న నాయకులు



మండపేటలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నాయకుల నివాళి

సావిత్రిబాయి పూలే త్యాగాలను ప్రభుత్వం గుర్తించి ఆమె జయంతి రోజును జనవరి 3న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని, ఆమెకు భారతరత్న బిరుదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మగాపు అమ్మిరాజు, కానీల వీరభద్రరావు, కొత్తపల్లి దుర్గా ప్రసాద్, వేమవరపు రాంబాబు, షావుకారు శివయ్య, సూదంశెట్టి గంగాధర్, కొండేటి రామకష్ణ, రాజాన గోవింద్, మెడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **మండపేట** తొలితరం ఉపాధ్యాయురాలు, మహిళల విద్యా హక్కుల కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన మహిళా ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే వర్ధంతి జాతీయబిసి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె సమాజ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పిల్లి శ్రీనువాస్, కోన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న సర్పంచ్ రామచంద్రరావు

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి ప్రభుత్వం ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదలకు అండగా నిలిచిందని సర్పంచ్ యర్రంశెట్టి రామ చంద్రరావు అన్నారు. మునిపల్లి పంచాయతీలో ఆదివారం వాలంటీర్ ఎ. సునీతతో కలిసి సర్పంచ్ రామచంద్రరావు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అయిదేళ్లలో ప్రతి ఇంటికీ చేకూర్చిన లబ్ధిని వివరించారు. పేదల సంక్షేమానికి పాటుపడుతున్న సిఎం జగన్‌ను మరోసారి సిఎంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొమ్ముల సూర్య నారాయణ, ఎస్.దేవి, పేరూరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్‌లో గోదావరి భవన్ నందు జిల్లా స్థాయి 'స్పందన జగనన్నకు చెబుదాం' కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగందృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

ఒక వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని బడుగువానిలంకలో మార్గాని రమేష్ (43) అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతడి భార్య పథకం ప్రకారం హత్య చేసినట్లు రమేష్ బంధువులు ఆరోపిస్తు ఫిర్యాదు చేశారు. అయితే రమేష్ రావులపాలెం ఆర్‌టిసి బస్ స్టాండులో జామకాయలు విక్రయిస్తు వచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారు ఎన్‌టి రాజాపురం గ్రామ కూడలి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసుల వివరాలు... ఆదివారం తెల్లవారుజామున పెద్దాపురంకి చెందిన బొడ్డు మోషే, అతని తండ్రి మరిడియ్య తన భార్య కలిసి ఎన్‌టి రాజాపురం బంధువులు ఇంటికి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో జంక్షన్ దాటుతుండగా జగ్గంపేట వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొడ్డు మోషే అతని భార్య లక్ష్మి కుమారికి బలమైన గాయాలయ్యాయి. వారిని కాకినాడ జిజిహెచ్‌కు 108 అంబులెన్స్‌లో తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల్లో ఆదివారం పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వసంతవాడ గ్రామ శివారున పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,30 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చిక్కాలపాలెం గ్రామ శివారులో శనివారం కోడిపందేలు ఆడుతున్న వారిపై చాగల్లు ఎస్ఐ పి.నాగరాజు సిబ్బందితో దాడి చేశారు. 11 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.33 వేల నగదు. రెండు కోళ్ల రెండు కత్తులను స్వాధీన పరచుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చాగల్లు ఎస్ఐ హెచ్చరించారు.



బియ్యం స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -దేవరపల్లి

గౌరీపట్నం జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం అక్రమంగా రవాణా చేస్తున్న 12,200 కేజీల పిడిఎస్ బియ్యంను సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్‌పై 6 ఎ, 7 కేసులను నమోదు చేశారు. వాహనాన్ని దేవరపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు సిబ్బంది తెలిపారు. దేవరపల్లి సివిల్ సప్లై డిటి సత్యనారాయణ, గోపాలపురం డిటి ప్రభాకరావు, రాజముండ్రి, నిడదవోలు డిటిలు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కడియం

మద్యం అమ్ముతున్న దుళ్ల గ్రామానికి చెందిన బొల్లం రాజు, కెఎన్.రాజును పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. కడియం ఎస్ఐ బి.నాగ దుర్గా ప్రసాద్, ఎస్ఐ టి.కృష్ణ సాయి ఆదివారం దాడులు నిర్వహించారు. ఎటువంటి లైసెన్స్, అనుమతి లేకుండా మద్యం సీసాలు అమ్ముతున్న ఇద్దరినీ అదుపులోనికి తీసుకున్నామని పేర్కొన్నారు.

మహిళల హక్కుల సాధనే లక్ష్యం

ప్రజాశక్తి - గండేపల్లి, పెద్దాపురం

మహిళలు తమ హక్కుల సాధనే లక్ష్యం గా ముందుకు సాగాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు. ఆదివారం మండలంలోని మురారి గ్రామంలో మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభావతి 'మహిళా సాధికారిత, సమాజంలో మహిళ పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. మార్చి 8న అంతర్జాతీయంగా జరుగుతున్న మహిళా దినోత్సవానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఎంతోమంది చేసిన పోరాటాల ఫలితంగా అన్ని దేశాల్లో మహిళలకు కొన్ని హక్కులు లభించాయని గుర్తు చేశారు. మహిళలకు విద్య, ఓటు హక్కు వచ్చిందంటే దానివెనుక ఎన్నో పోరాటాలు ఉన్నా యని అన్నారు. సమాజంలో నేటికీ మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంతోమంది మహిళలు ప్రపంచ వ్యాప్తంగా సమానత్వం కోసం తమ గొంతులను వినిపిస్తూనే ఉన్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల చిన్నచూపుతూనే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్య బట్టారు. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ హక్కుల కోసం పోరాటాలను సాగించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నరాము, కమిటీ నాగేష్, చక్రవర్తి, సాయిరామ్, పివివి.సత్య నారాయణ, సతీష్‌బాబు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాస్



ముఖా-ముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రామీణ నీటి సరఫరా పథకం ఎస్ఇ ఎం.శ్రీనివాస్ అన్నారు. అన్ని ప్రాంతాలకూ సక్రమంగా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయడంతో బాటు చేతి పంపులన్నింటినీ మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. కాకినాడ జిల్లాలో 385 గ్రామ పంచాయితీల్లో 667 ఆవాసాల్లో 21 సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాల ద్వారా 374 ఆవాసాలకు రక్షిత మంచినీటి సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు 710 రక్షిత మంచినీటి సరఫరా పథకాలు, 3415 చేతి పంపుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మిగిలిన అన్ని ఆవాసాలకూ తాగునీటి సరఫరా జరుగుతోందని తెలిపారు.

జల్ జీవన్ మిషన్ పనులు ఎలా జరుగుతున్నాయి.

మొత్తం 3,89,205 ఇళ్లకు కుళాయి ద్వారా మంచి నీరు సరఫరా చేయడానికి రూ.407.66 కోట్లకు ప్రణాళిక తయారు చేయగా ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులను మంజూరు చేసింది. ఇందులో మొత్తం 874 పనులు మంజూరు కాగా మూడేళ్ళలో ఇప్పటి వరకు రూ.97.85 కోట్ల విలువైన 385 పనులు పూర్తయ్యాయి. ఇంకా 153 పనులు పురోగతిలో ఉన్నాయి. 27 పనులు ప్రారంభమే కాలేదు.

మిగిలిన పనులకు టెండర్లు పూర్తి అయ్యాయా.

మొదటి విడతలో 565 ఆవాసాల్లో కుళాయిలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వ వాటా 50 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతంతో మొత్తం రూ.245.03 కోట్లకు పరిపాలనా ఆమోదం లభించింది. ఇందులో రూ.5 లక్షల లోపు ఉన్న 18 పనులకు రూ.54 లక్షలు మంజూరు కాగా 13 పనులు ప్రారంభించి పూర్తి చేసారు. రూ.5 లక్షలు పైబడిన 410 పనులకు రూ.194.63 కోట్లు మంజూరు కాగా అన్ని పనులకు టెండర్ల ప్రక్రియను ఇప్పటి వరకు పూర్తి అయ్యాయి.

ఇంకా ఏయే పనులు పూర్తి కావాల్సి ఉంది.

ఇప్పటి వరకు 250 పనులు పూర్తయ్యాయి. మరో 121 పనులు పురోగతిలో ఉండగా ఇంకా 39 పనులు మొదలు కావాల్సి ఉంది.ఇప్పటికే ఉన్న త్రాగునీటి వనరుల పెంపుదల కేటగిరీలో భాగంగా రూ.49.86 కోట్ల విలువైన 137 పనులకు గాను 136 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా 106 పనులు పూర్తయ్యాయి. 30 పనులు పురోగతిలో ఉన్నాయి.

తాగునీటి ఎద్దడిపై తీసుకుంటున్న చర్యలు ఏమిటి.

జిల్లాలో రక్షిత మంచినీటి సరఫరా పథకాల మరమ్మతుల నిమిత్తం నాన్ సిఆర్ఎఫ్ గ్రాంట్ నుంచి ప్రతిపాదనలు తయారు చేశాము. జిల్లాలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి, సిఎండిఫ్ నిధుల నుండి మొత్తం 50పైనే పనులు మంజూరు అయ్యాయి.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ గురించి చెప్పండి.

తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నాం. బోర్లు, చేతిపంపులు, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టడానికి రూ.14.68 లక్షలతో ప్రతిపాదించాం. ప్రధానంగా కాకినాడ రూరల్ తూరంగి, మహాలక్ష్మి నగర్, వాకలపూడి, తాళ్ళరేవు మండలం తదితర ప్రాంతాలకు రవాణా సౌకర్యం ద్వారా సరఫరా జరుగుతుంది. 50 బోర్లు మరమ్మతులు కోసం రూ.6.18 లక్షలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపడానికి, ఇతర రిపేర్లుకు రూ.8.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాము.

గ్లో గార్డెన్ పార్క్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఇంత అద్భుతమైన పార్కు లేదని, రాజమండ్రి నగర శోభను మరింత ఇనుమడింప చేస్తుందని రాజమండ్రి ఎంపీ, వైసిపి సిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక లాలాచెరువు జంక్షన్ నుంచి క్వారీ మార్కెట్ కు వెళ్ళే దారిలో రూ.4.4 కోట్లతో అత్యద్భుతంగా నిర్మించిన 'గ్లో గార్డెన్'ను ఎంపీ భరత్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ గార్డెన్‌లో రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలిసి ఎంపీ భరత్ కలయ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి నగర వాసులను, ముఖ్యంగా పిల్లలను ఈ గ్లో గార్డెన్ విశేషంగా ఆకట్టుకుంటుందని అన్నారు. నగరంలో కంబాల చెరువు పార్కుకు ఎంత ప్రజాదరణ లభించిందో దానికి రెండింతలు ఈ పార్కుకు ఎక్కువ ఆదరణ లభిస్తుందని ఆయన ఆకాంక్షించారు. అనంతరం నగరంలోని 50వ డివిజన్‌లో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన ఎస్‌బిఐ కాలనీ పార్కును, అదే వార్డులో రూ.40 లక్షలతో నిర్మించిన రెవెన్యూ కాలనీ పార్కును ఎంపీ భరత్ ప్రారంభించారు.



పార్కులో ఎంపీ భరత్‌తో సెల్ఫీలు

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ముగ్గురికి మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఎంపీ భరత్ లబ్దిదారులకు చెక్‌ల రూపంలో అందజేశారు. తలారి వెంకట శ్రీధర్‌కు రూ.4 లక్షలు, దుంగ సంధ్యకు రూ.3.5 లక్షలు, కొడమాటి శివ రామకృష్ణకు రూ.లక్ష చెక్కులను ఎంపీ భరత్ అందజేశారు.

వేర్వేరు చోట్ల రోగులకు ఉచిత వైద్య పరీక్షలు



కమిని పంచాయతీ వద్ద ఉచితవైద్య శిబిరం

జిల్లాలో వేర్వేరు చోట్ల ఉచిత వైద్యశిబిరాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వివిధరకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ముమ్మిడివరం కమిని పంచాయతీ కార్యాలయం వద్ద ముమ్మిడివరంలోని మంజీరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ మంజీరా ఆధ్వర్యంలో స్త్రీ సంబంధిత వ్యాధులపై ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వలసల తిప్ప ఎంపిటిసి సభ్యురాలు కొండేపూగి గంగాభవాని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉచిత వైద్యశిబిరం ద్వారా వైద్య సేవలు అందించేందుకు మంజీరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ మంజీరా ముందుకురావడం అభినందనీయమని అన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 130 మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా, అవసరమైన వారికి సుమారు రూ.16 వేలు విలువ కలిగిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా స్త్రీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ మంజీరా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారన్నారు.వీరికి సేవా దక్పథంతో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించేందుకు మంజీరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తన వంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శేరులంక సర్పంచ్ కొండేపూడి భద్ర రావు, కమిని మాజీ సర్పంచ్ గెడ్డం శేఖర్, కొండేపూడి నాగేశ్వర రావు, గుర్రాల వెంకట రావు, నేరెడుమిల్లి అబ్బులు మాస్టర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మామిడికుదురు మానవతా స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో మామిడికుదురు ఎస్ సి కమ్యూనిటీ హాలు నందు ఆదివారం మెగా వైద్య శిబిరంలో 151మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నట్టులు సంఘ అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ ఎం.శివ ఆశిష, జి.అంజలి జనరల్ విభాగం, కోట నితీశ్వర్ పిల్లల వైద్య నిపుణులు, సలాది శర్వాణి మహిళా వైద్య నిపుణులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.



మామిడికుదురు లో మెగా వైద్య శిబిరం

తెలుగు నవ గర్జన పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక అయినాపురం రోడ్ లో నియోజక వర్గ అభ్యర్థి మల్లాడి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన తెలుగు నవ గర్జన పార్టీ నూతన కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాట్రు నాగబాబు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం, వ్యవస్థలో మార్పు కోసం, సామాన్యుల జీవన స్థితిగతుల్లో మార్పు కోసం తెలుగు నవ గర్జన పార్టీ ఆవిర్భవించిందన్నారు. నియోజకవర్గ అభ్యర్థి కృష్ణారావును అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు. కార్యక్రమం లో మహర్షి శ్రీను శివ నాగు శివాజీ వీరబాబు సాగర్ రాజు విజయ్ దుర్గా ప్రసాద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

తోలుబొమ్మలాట శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కాకినాడ ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులోని సత్కళావాహినిలో తోలుబొమ్మలాట శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొని మాట్లాడుతూ నృత్య దశలో నుంచి మానవుడు నాటక దశలోనికి ఎదిగే పరిణామ క్రమంలో తోలుబొమ్మలాట ప్రముఖ పాత్ర వహించిందని అన్నారు. యువత మన సాంప్రదాయాలు అత్యంత సుసంపన్నమైన కళారూపాలను నేర్చుకునేలా వారికి తగిన వేదికను అందించాలనే ఆలోచనతో ఈకార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. వేసవి శిబిరంలో పిల్లలు మాంద్నా, తోలుబొమ్మలాట, కాలిగ్రఫీ అల్కొజావదన్ వంటి కొత్త కళారూపాలను నేర్చుకోంటారన్నారు. పాల్గొనేవారు వివాహాలు, జానపద నృత్యం, మాంద్నా చేతితో రాసిన ఆహ్వానాన్ని రాసే కళ ఆధారంగా జానపదనృత్యాలను కూడా నేర్చుకోవచ్చని ఆయన తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లోని శిక్షకులకు ఆయన సత్కరించారు.

యానాం వార్తలు

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. యానాంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక శాతం ఓట్లు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా తనను నియమించిన పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ అధిష్టానంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి యానంలో పూర్వవైభవం తీసుకొస్తామని, తన రాజకీయ ప్రయాణం కాంగ్రెస్ పార్టీతోనే సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.



బాధితురాలికి పత్రాలను అందిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన బాధితురాలికి ఆదివారం కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు ఆర్థిక సాయాన్ని అందించారు. స్థానిక ఆర్ఎఒ ఛాంబర్లో జరిగిన కార్యక్రమంలో కురసాంపేటకు చెందిన బాధితురాలు వాడ్రేవు నూకరత్నంకు రూ.20వేలను ఫిక్సిడ్ డిపాజిట్ చేసి వాటి పత్రాలను నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను ఆర్ఎఒ మునిస్వామి ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా చేయూత ప్రతినిధులు మాట్లాడుతూ సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.రవికుమార్, కార్యదర్శి ఎంఎ.అలీమ్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.వలీభాషా, పవన్, ప్రవీణ్, జిలానీ, సుభహాన్, కామరాజు పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పరిసరాలను శుభ్రం చేసిన వాలంటీర్లు

ప్రజాశక్తి - యానాం

యానాం లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన ఎన్.ఎస్.ఎస్.ప్రత్యేక శిబిరం కొనసాగుతోంది. మూడవ రోజైన ఆదివారం వాలంటీర్లు స్వచ్ఛభారత్, పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ఆవరణతోపాటు పరిసర ప్రాంతాలలో చెత్తా చెదారాన్ని, తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. అలాగే కళాశాలలో గల మొక్కలకు నీరు పోశారు. అలాగే క్షయవ్యాధిపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వీకృష్ణ పాల్గొని మాట్లాడారు. క్షయవ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండటం అవసరమని అన్నారు. క్షయవ్యాధిపై ఉన్న అపోహలను ప్రజలు నమ్మవద్దని కోరారు. క్షయవ్యాధికి మంచి వైద్యం అందుబాటులో ఉందని, మందులు వాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే క్షయవ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. క్షయవ్యాధి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించాలని కోరారు. సదస్సులో కౌన్సిలర్ ఎస్ఎస్‌వి.శర్మ, ఆర్‌విజి.రాజు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యకమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఎన్ఎస్-ఎస్ పిఒ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించిన నియామక పత్రాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.నరసింహనాయక్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల జిఒ నెంబర్ 30, 31 ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 290 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణ జరిగిందని తెలిపారు. అందులో భాగంగా 247 మందికి రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు నుంచి ఆదేశాలు వచ్చాయని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 243 మంది అభ్యర్థులలో 192 ఎంపిహెచ్(ఎం), 44 ఎంపిహెచ్(ఎస్)కు క్రమబద్ధీకరణ చేయడం జరిగిందన్నారు. ఫార్మసిస్ట్ గ్రేడ్ 17 గురికి సర్టిఫికెట్ వెరిఫి కేషన్ చేసి తదుపరి చర్యల నిమిత్తం రాజమహేంద్రవరం జోన్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు. మిగిలిన 43 ఉద్యోగుల క్రమబద్ధీకరణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వారికి కూడా క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.



గడియార స్తంభం సెంటర్లో ధర్నా నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు

నిందితులను శిక్షించాలని డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

విశాఖ జిల్లా మధురవాడ గ్రామానికి చెందిన సాయి అనే ఫొటోగ్రాఫర్ ను ప్రోగ్రాం పేరుతో తీసుకువెళ్లి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని అమలాపురం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆదివారం డిమాండ్ చేసింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఫొటోగ్రాఫర్లకు భద్రత కలిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణ గడియార స్థంభం సెం టర్‌లో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కాజ బాబు ప్రెసిడెంట్, నగేష్ సెక్రటరీ తాతాజీ, ట్రెజరర్ నాగేంద్ర వైస్ ప్రెసిడెంట్ పొట్టుపోతు నాగు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణ ప్రసాద్, ఉషాకిరణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే టిడిపి టిక్కెట్ కేటాయించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం టిడిపి టిక్కెట్ స్థానిక పార్టీ నాయకులకు కేటాయించాలని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదివారం ద్రాక్షారామ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి 2019లో ఓటమి పాలైన తర్వాత పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి బలోపేతం చేయడానికి స్థానిక నాయకులు కషి చేశారని అందులో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, నారా లోకేష్ యువజన సంఘం నాయకులు సాయి తేజ , జెడ్‌పిటిసి అభ్యర్థి అన్నపూర్ణ ఉన్నారని అన్నారు. ఎన్నో ఉద్యమాలు ఆందోళన చేపట్టిన స్థానిక నాయకత్వానికే టిక్కెట్ కేటాయించాలన్నారు.తమలో ఎవరు కేటాయించిన ఈ సీట్ను గెలిచి చంద్రబాబుకు బహుమతిగా అందజేస్తామన్నారు. ఎంతకాలం పార్టీకి పనిచేసిన సేవలకు గుర్తింపుగా తమ నలుగురిలో ఎవరికైనా ఒకరికి టిక్కెట్ ఇవ్వాలని వారు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తామంతా సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నాయకులు పోతుల మాధవ్, పిల్లి శ్రీను, పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పిల్లి సూర్యప్రకాష్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రామచంద్రపురం


ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణం లోని 27వ వార్డు, గుళ్లవారిపేట ఆదివారం 'గడప..గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాస్ రాజు కార్యక్రమంలో పర్యటించారు. వారికి వార్డు నాయకులు పెద్దలు ఘన స్వాగతం పలికారు. పలు సమస్యలను సూర్య ప్రకాష్‌కు దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కారిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కట్టా శ్రీరాములు, పట్టణ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వైస్ ఛైర్‌పర్సన్ చింతపల్లి నాగేశ్వరావు, వివిధ వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో గల వైసిపి కార్యాలయంలో కాజులూరు మండలం బంధనపూడి గ్రామానికి చెందిన 50 మంది వైసిపిలో చేరారు.

ఇప్పనపాడులో గడప..గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-మండపేట

పేదల అభ్యున్నతి ధ్యేయంగా పాలన సాగిస్తున్న సంక్షేమ సారధి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు.

మండలంలోని ఇప్పనపాడు గ్రామంలో గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు వైసిపి నాయకులు తిరుసూల శ్రీను, చిన్ని గంగాధరంతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో పనుల కోసం నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. సిఎం జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావులేకుండా వాలంటీర్లు తలుపుతట్టి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండమట్ల వాసు, వైసిపి రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.



కందికుప్పలో 'దాట్ల' ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కంది కుప్ప గ్రామంలోని బజ్జవారిపేట, మిలిటరీ పేట, మెయిన్, గరువుపేట, గాజింగు తిప్ప గ్రామాలలో ఆదివారం ముమ్మిడివరం టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. గడచిన అయిదేళ్ల కాలంలో గ్రామాల్లో అభివృద్ధి అనేదే లేకుండా పోయిందని విమర్శించారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు నడుంపల్లి సుబ్బరాజు, ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, గుత్తుల సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి కుడిపూడి సోషల్ మీడియా ప్రకటనలపై ఖండన

ప్రజాశక్తి-అమలాపురం

గత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కాపు యువత సాధించుకున్న బిసి(ఎఫ్) వంటి ప్రత్యేక జిఒల కృషిని ముద్రగడ పద్మనాభం ఖాతాకు జమ చేస్తూ ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణ రావు సోషల్ మీడియా ప్రకటనల ద్వారా ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామని కాపునాడు కార్యనిర్వహక అధ్యక్షులు అబ్బిరెడ్డి సురేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాపు ఉద్యమం పట్ల అంత సానుభూతి వుంటే ముద్రగడతో కలిసి వైసిపి మానిఫెస్టోలో కాపు రిజర్వేషన్‌కు స్థానం కల్పించగలరా అని కాపునాడు సవాల్ విసురు తోంద న్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు గంగుమళ్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిపల్లి ధర్మారాజు, ముమ్మిడివరం, నియోజకవర్గాల సమన్వయకర్తలు నంద్యాల చంటి, తోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఉపయోగాలపై వర్క్ షాప్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్లో ఆదివారం వివిధ పాఠశాలల్లో చదివే 6వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ ప్రయోగాల సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలలోని సైన్సు పాఠాలకు సంబంధించి ప్రయోగాల ద్వారా విశ్లేషణాత్మకంగా విద్యార్థులకు వివరించడం వల్ల సైన్సు పట్ల ఆసక్తి పెరుగుతుం దన్నారు. సైన్స్ ప్రయోగ పరికరాలు విద్యార్థుల చేతులకు ఇచ్చి వారితో ప్రయోగాలు చేయించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో ఆర్‌బి కొత్తూరు జడ్‌పి ఉన్నత పాఠశాల, తాటిపర్తి శ్రీ విద్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల, సామ ర్లకోట గౌతమి మోడల్ స్కూల్, పెద్దాపురం చాచా స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.